
DD9 వార్త
తెలుగు దినపత్రిక

వ్యక్తి ఉన్నతమైన
స్థితిలో ఉన్నాడంటే,
అతడు ఎన్నో
కఠిన పరీక్షల్ని
ఎదుర్కొని
నిలిచాడని అర్థం

- గౌతమ బుద్ధుడు

## రేపటి నుంచి తెలంగాణ
# ఇంటర్ పరీక్షలు



**పరీక్షలకు 10 లక్షల మంది విద్యార్థులు**
**రాష్ట్ర వ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు**
**ఇంటర్ బోర్డు కార్యదర్శి సూచనలు**
**రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలు**
**విధుల్లో 28,500 మంది ఇన్విజిలేటర్లు**
**సీసీ కెమెరాల నిఘాలో నిర్వహణ**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలు మార్చి 18వ తేదీ

..మిగతా 3లో

సంపుటి : 01 సంచిక : 187 హైదరాబాద్, ఫిబ్రవరి, మంగళవారం 24, 2026 పేజీలు : 06 వెల : 3.00



# బీఆర్ఎస్ ఫెయిల్ అయింది..
## జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

**జోగులాంబ గద్వాలలో రైతు సంఘర్షణ సభలో పాల్గొన్న కవిత**
**భవిష్యత్తులో జోగులాంబ జిల్లా నుంచే కార్యక్రమాలు చేపడతామని హామీ**
**నడిగడ్డను బీఆర్ఎస్ మోసం చేసిందన్న కవిత**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
బీఆర్ఎస్ పూర్తిగా ఫెయిల్ అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన 'రైతు సంఘర్షణ' సభలో

..మిగతా 3లో





# దేవాదుల ప్రాజెక్టుకు రథసారథి రేవంత్ రెడ్డి

**నిలిచిన పనులకు కొత్త దిశ చూపిన సీఎం**
**ఏజెన్సీ రైతుల ఆశలకు బలం ఇచ్చిన ప్రభుత్వం**
**రూ.600 కోట్లతో ప్రాజెక్టు పనులు వేగ వంతం**
**సాగునీటి కలను సాకారం చేసే చర్యలు**
**గోదావరి జలాలను రైతు పొలాలకు తీసుకెళ్లే సంకల్పం**
**ములుగు జిల్లాను శస్యశ్యామలం చేయడమే లక్ష్యం**
**దేవాదులపై ప్రత్యక్ష సమీక్షతో వేగవంతమైన నిర్ణయాలు**
**గిరిజన రైతుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి**
**రెండుపంటల సాగుకు ప్రభుత్వం కట్టుబాటు**
**నిలిచిన పనులు పూర్తి చేస్తామన్న సీఎం**
**గ్రామీణ అభివృద్ధికి దేవాదుల ప్రాజెక్టు కీలకం**



**ఏటూర్ నాగారం క్రైమ్,ఫిబ్రవరి 23,(డిడి9 వార్త):**
దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని వేగవంతం చేస్తూ ఏజెన్సీ రైతులకు సాగునీటి సిరులు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాధాసారధిగా ముందుకు సాగుతున్నారు. ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన పనులకు నూతన ఊపిరి పోస్తూ రూ.600 కోట్లతో ప్రాజెక్టు పురోగతికి మార్గం సుగమం చేయాలని ప్రభుత్వం

..మిగతా 2లో

# పెళ్లి పేరుతో మోసాలు.. అమ్మాయిలూ జాగ్రత్త!



**యువతులకు సీపీ సజ్జనార్ హెచ్చరిక**
**అప్రమత్తంగా ఉండాలని సూచనలు**
**నగరంలో పెరుగుతున్న మోసాలు**
**పెద్దలు కుదిర్చిన పెళ్లిలోనూ అదే తంతు**
**షీ టీమ్స్ దృష్టికి తీసుకురావాలన్న పోలీసులు**
**అమ్మాయిల వివరాల భద్రతకు హామీ**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
హైదరాబాద్ నగరంలో పెళ్లి పేరుతో జరుగుతున్న మోసాలపై పోలీస్ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రేమ పేరుతోనే కాకుండా, పెద్దలు కుదిర్చిన సంబంధాల మాటున కూడా కొందరు మోసగాళ్లు యువతులను వలలో వేస్తున్నారని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఫిర్యాదులు షీ టీమ్స్‌కు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు.

**పెళ్లి చూపుల నుంచి మోసం వరకు**
సీపీ వివరాల ప్రకారం, ముందుగా సంప్రదాయబద్ధంగా పెళ్లి చూపులు చూసి, కుటుంబ సభ్యుల సమక్షంలో నిశ్చితార్థం జరుపుకుంటున్నారు. పెళ్లి ఖాయం అయ్యిందనే నమ్మకంతో

..మిగతా 3లో

# నా పేరుతో సంస్థలు పెట్టొద్దు

**నా పేరుతో ఎలాంటి సంస్థలు లేవు.. అలాంటి ప్రయత్నాలను ప్రోత్సహించం**
**కేటీఆర్ సేవా సమితి, కేటీఆర్ సేవ పేరుతో కార్యకలాపాలు**
**తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని స్పష్టీకరణ**
**ఎవరైనా పని చేయాలనుకుంటే బీఆర్ఎస్ పార్టీలో కలిసి పని చేయాలని సూచన**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తన పేరుతో కొంతమంది సంస్థలను ఏర్పాటు చేసినట్లు వచ్చిన వార్తలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తెలంగాణలో 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' పేరుతో కొన్ని సంస్థలు కార్యకలాపాలు చేపడుతుండటంపై ఆయన స్పందించారు. తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని వెల్లడించారు. అలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో

..మిగతా 3లో

# డీజీపీ గారూ... అవి ఫేక్ న్యూస్ క్లిప్పింగ్స్

**సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా ఫేక్ న్యూస్ క్లిప్పుల ప్రచారం**
**ఇది పోలీసు వ్యవస్థ విశ్వసనీయతపై జరుగుతున్న దాడి అని హరీశ్ రావు ఆరోపణ**
**ఫేక్ న్యూస్ వెనుక ఉన్నవారికి సీఎం అండదండలు ఉన్నాయా అని ప్రశ్న**
**దుష్ప్రచారం చేస్తున్నవారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. "పోలీసుల అంతు చూసేదాకా వదలబోము" అంటూ తన పేరిట ఓ ఫేక్ వీడియో క్లిప్ సర్క్యులేట్

..మిగతా 3లో



# వైద్య విధాన పరిషత్ స్థానంలో కొత్త డైరెక్టరేట్

**తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం**
**మెట్రోను స్వాధీనం చేసుకోనున్న ప్రభుత్వం**
**మెట్రో పొడిగింపునకు కేబినేట్ ఆమోదం**
**సీఎం క్యాంప్ ఆఫీస్‌కు గ్రీన్ సిగ్నల్**
**రూ.9 కోట్ల వ్యయంతో హై సెక్యూరిటీ**
**టెండర్లకు ఆర్అండ్‌బీ ఆహ్వానం**
**మార్చి 4 వరకు దరఖాస్తులకు గడువు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆరోగ్యం, రవాణా, పరిపాలనకు సంబంధించిన ముఖ్య అంశాలపై చర్చించి ఆమోదం తెలిపింది. రాష్ట్ర పరిపాలనలో మార్పులకు దారి తీసే నిర్ణయాలు తీసుకోవడం

..మిగతా 2లో

# గ్లోబల్ వాల్యూ హబ్‌గా హైదరాబాద్

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**
**హార్ట్‌ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్ ప్రారంభం**
**ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు**
**నగరంలో ఇప్పటికే 400 కేపబిలిటీ సెంటర్లు**
**హార్ట్‌ఫోర్డ్‌తో అంతర్జాతీయ గుర్తింపు**
**నగరం నుంచి అధునాతన సేవలు**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
హైదరాబాద్‌ను కేవలం ఐటీ నగరంగా కాకుండా, పలు కీలక రంగాల్లో ప్రపంచ స్థాయి విలువ సృష్టించే కేంద్రంగా అభివృద్ధి చేయాలని

..మిగతా 3లో

# ఇరాన్ విడిచిపెట్టండి

**అక్కడ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి**
**అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఉంది**
**ఏ క్షణమైనా అమెరికా దాడి చేసే అవకాశం**
**భారతీయ పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలి**
**భారత విదేశాంగ శాఖ కీలక సూచనలు**




**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**
మధ్యప్రాచ్యంలోని ఇరాన్ దేశంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికాఇరాన్ మధ్య నెలకొన్న టెన్షన్లు రోజురోజుకూ ముదిరిపోతున్నాయి. ఏ క్షణమైనా అమెరికా

..మిగతా 2లో

# కర్రెగుట్టల్లో భారీ కూంబింగ్

**ఆపరేషన్ కగార్‌ను ముమ్మరం**
**మవోయిస్టుల కోసం వేట తీవ్రతరం**
**డ్రోన్లను ఎగురవేస్తున్న బలగాలు**
**అణువణువు గాలిస్తున్నవైనం**

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**
మావోయిస్టు పార్టీ ఉనికిని పూర్తిగా రూపుమాపేందుకు భద్రతా బలగాలు ఆపరేషన్ కగార్‌ను ముమ్మరం చేశాయి. డ్రోన్ల సహాయంతో కర్రెగుట్టలు మొత్తం అణువణువు గాలిస్తున్నాయి. అదే సమయంలో

..మిగతా 3లో



## ఉద్యమకారులకు "అభయహస్తం" అమలు చేయండి

**ఇళ్ల స్థలాలు, పెన్షన్‌పై చర్యలు తీసుకోండి**
**తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**
**8 వారాల గడువు ఇస్తూ కీలక తీర్పు**
**ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్న కోర్ట్**
**న్యాయస్థానం తీర్పుపై ఉద్యమకారుల హర్షం**







# దేవాదుల ప్రాజెక్టుకు రథసారథి
# రేవంత్ రెడ్డి





**మొదటిపేజీ తరువాయి**

సంకల్పించినట్లు తెలుస్తోంది. దేవాదుల పూర్తితో ములుగు జిల్లాలో రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా చర్యలు ప్రారంభమయ్యాయి.సాగునీటి కోసం ఎదురుచూస్తున్న ఏజెన్సీ ప్రాంత రైతులకు ఇది కీలకమైన పరిణామంగా చెప్పవచ్చు

ములుగు జిల్లాలోని అనేక మండలాల్లో వర్షాధార వ్యవసాయం మాత్రమే ప్రధానంగా కొనసాగుతోంది. నీటి వనరులు స్థిరంగా లేకపోవడంతో పంటలు ఆశించిన స్థాయిలో రాక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి అధికంగా ఉంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో వేల ఎకరాల భూములు సాగునీరు లేక బీడుగా ఉండటం వల్ల వ్యవసాయాదరిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి దేవాదుల ప్రాజెక్టు పనులపై ఆదివారం సమీక్ష నిర్వహించారు.సంబంధిత మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ అధికారులు ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించి నిలిచిపోయిన పనుల వివరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో ముందుకు తీసుకెళ్లేందుకు సుమారు రూ.600 కోట్ల నిధులు అవసరమని అధికారులు వివరించగా, అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చే దిశగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తయితే గోదావరి జలాలను ఎత్తిపోసి కాలువల ద్వారా ఎండబారిన ప్రాంతాలకు చేరేలా ప్రణాళిక రూపొందించబడింది. దీనివల్ల ప్రస్తుతం వర్షాలపై ఆధారపడుతున్న రైతులు సంవత్సరానికి రెండు పంటలు పండించే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. వరి, మక్క, పత్తి వంటి పంటలతో పాటు వాణిజ్య పంటలు కూడా సాగు చేసే పరిస్థితులు ఏర్పడతాయని అంచనా వేస్తున్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన రైతులే అధికంగా ఉండటం వల్ల ఈ ప్రాజెక్టు వారికి మరింత ఉపయోగకరంగా మారుతుందని భావిస్తున్నారు. చిన్నచిన్న భూభాగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కుటుంబాలకు సాగునీరు అందితే స్థిరమైన ఆదాయం వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. పంటలతో పాటు పశుసంవర్ధక, తోటల సాగు కూడా అభివృద్ధి చెందే అవకాశముందని పేర్కొంటున్నారు.

సాగునీరు అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. వ్యవసాయ పనులు విస్తరించడంతో కూలీలకు నిరంతర ఉపాధి లభిస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే వలసలు కూడా తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

ఇంజినీరింగ్ అధికారులు కాలువల విస్తరణ, పంపింగ్ వ్యవస్థల మెరుగుదల, నీటి పంపిణీ ప్రణాళికలపై సాంకేతిక చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. నీటి వృథాను తగ్గించేందుకు ఆధునిక పద్ధతులను ఉపయోగించాలనే ఆలోచన కూడా ఉన్నట్లు సమాచారం. డ్రిప్, స్ప్రింక్లర్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ సాగు సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

ప్రాజెక్టు పునరుద్ధరణపై గ్రామాల్లో చర్చలు పెరిగాయి. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సాగునీరు త్వరలో అందుతుందనే ఆశతో రైతులు సానుకూల స్పందన వ్యక్తం చేస్తున్నారు. పనులు వేగంగా పూర్తయితే వచ్చే వ్యవసాయ సీజన్ నుంచే ప్రయోజనం కనిపించవచ్చని భావిస్తున్నారు.

మొత్తంగా దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తయితే ములుగు జిల్లా వ్యవసాయ రంగంలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. సాగునీటి విస్తరణతో పంటల ఉత్పత్తి పెరగడం, రైతుల ఆదాయం మెరుగుపడడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం వంటి మార్పులు కనిపించవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతన్న ఇంట సిరుల పంట పండాలనే ఆశతో ఈ ప్రాజెక్టు పనుల పురోగతిని స్థానికులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# వైద్య విధాన పరిషత్ స్థానంలో కొత్త డైరెక్టరేట్

**మొదటిపేజీ తరువాయి**

గమనార్హం.

**వైద్య విధాన పరిషత్‌కు బదులుగా కొత్త డైరెక్టరేట్**

ఉమ్మడి రాష్ట్ర కాలం నుంచి కొనసాగుతున్న వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) వ్యవస్థ స్థానంలో కొత్తగా "డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్" ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఇప్పటివరకు స్వయం ప్రతిపత్తి సంస్థగా పని చేస్తున్న టీవీవీపీ ఇకపై ప్రభుత్వ భాగంగా మారనుంది. అయితే పరిపాలనా పరంగా మార్పులు వచ్చినా, ప్రజలకు అందించే వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల ద్వారా సెకండరీ హెల్త్ సర్వీసులు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 30 పడకల నుంచి 350 పడకల వరకు సామర్థ్యం కలిగిన ఆస్పత్రులు ఈ వ్యవస్థలో ఉన్నాయి. సుమారు నాలుగు వేల రెగ్యులర్ ఉద్యోగులు, మరో రెండున్నర వేల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. కొత్త డైరెక్టరేట్ అమల్లోకి వస్తే ఈ సిబ్బంది అంతా ప్రభుత్వ పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది. జీతభత్యాలు సకాలంలో చెల్లించేందుకు మార్గం సుగమం అవుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్‌ఇన్‌ఎయిడ్ ద్వారా నిధులు అందిస్తుండగా, కేంద్రం నుంచి నేషనల్ హెల్త్ మిషన్ కింద నిధులు వస్తున్నాయి. ఈ నిధులతో తల్లీబిడ్డల ఆరోగ్య సేవలు, ఔషధాల కొనుగోలు,



టీకాల కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కొత్త వ్యవస్థపై త్వరలోనే వైద్య ఆరోగ్య శాఖ మార్గదర్శకాలు విడుదల చేయనుంది.

**సీఎం క్యాంప్ ఆఫీస్‌కు ప్రహరీ గోడ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇప్పటివరకు అధికారిక క్యాంప్ ఆఫీస్ లేదు. ప్రస్తుతం జూబ్లీహిల్స్‌లోని తన నివాసాన్నే క్యాంప్ ఆఫీసుగా ఉపయోగిస్తున్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ) ఆవరణలో క్యాంప్ ఆఫీస్ ఏర్పాటు చేసే ప్రతిపాదనపై గతంలో పరిశీలన జరిగింది. ఇప్పుడు ఆ ప్రదేశంలో ఎత్తైన ప్రహరీ గోడ నిర్మించాలని కేబినెట్ నిర్ణయించింది. సుమారు రూ.9 కోట్ల వ్యయంతో హై సెక్యూరిటీ ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు. వాచ్ టవర్లు, కన్సెర్టినా వైర్, భారీ గేట్లు, ఫర్నీచర్, భద్రతా సదుపాయాలు, అప్రోచ్ ర్యాంప్, వీవీఐపీ గెస్ట్ హౌస్‌కు ప్రత్యేక రహదారి వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. రోడ్లు, భవనాల శాఖ ఇప్పటికే టెండర్లు ఆహ్వానించింది. మార్చి 4 వరకు దరఖాస్తులకు గడువు ఇచ్చారు. టెక్నికల్ బిడ్‌లను పరిశీలించి తక్కువ ధర కోట్ చేసిన సంస్థకు పనులు అప్పగించనున్నారు. రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు.

**మంత్రి తుమ్మల గైర్హాజరు**

ఈ కేబినెట్ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరు కాలేదు. వెన్నునొప్పి కారణంగా ముందుగానే సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఉదయం ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిసి అనారోగ్యంపై వివరించినట్లు సమాచారం. వ్యవసాయ శాఖకు సంబంధించిన అంశాలపై సీఎంతో చర్చించిన తర్వాత సమావేశానికి రాలేకపోయినట్లు చెబుతున్నారు. అయితే సమావేశం ప్రారంభానికి ముందు కొంతసేపు ఆయన కోసం వేచిచూసినట్లు సచివాలయ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు మంత్రి సమీప బంధువు దుబాయ్‌లో చికిత్స పొందుతున్నందున పరామర్శించేందుకు వెళ్లినట్లు సమాచారం. ఆయన గైర్హాజరు నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీనిపై అధికారిక వివరణ రావాల్సి ఉంది.

**కీలక మార్పుల దిశగా ప్రభుత్వం**

మొత్తంగా చూస్తే తెలంగాణ ప్రభుత్వం పరిపాలన, ఆరోగ్యం, రవాణా రంగాల్లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. వైద్య విధాన పరిషత్ స్థానంలో కొత్త డైరెక్టరేట్ ఏర్పాటు, మెట్రో స్వాధీనం, సీఎం క్యాంప్ ఆఫీస్ నిర్మాణం వంటి నిర్ణయాలు రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసే అవకాశముంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాల అమలు ఎలా జరుగుతుందన్నదే ఇప్పుడు ప్రధాన ఆసక్తిగా మారింది.

## హైదరాబాద్ మెట్రోపై కీలక నిర్ణయం

**మరో ముఖ్య నిర్ణయంగా హైదరాబాద్ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని కేబినెట్ నిర్ణయించింది. రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మెట్రో రెండో దశ విస్తరణను మొత్తం 86.1 కిలోమీటర్ల మేర నిర్మించాలనే ప్రణాళికకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.19,579 కోట్ల వ్యయం అంచనా వేశారు. సమగ్ర ప్రాజెక్టు నివేదికను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం వేగంగా ముందుకెళ్తోంది. ఇప్పటివరకు మెట్రో నిర్వహణలో ఎల్ అండ్ టీ కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు పూర్తిగా స్వాధీనం చేసుకోవాలనే నిర్ణయం తీసుకోవడంతో ఆ సంస్థ స్పందన ఏంటన్నది ఆసక్తికరంగా మారింది.**

# ఉద్యమకారులకు "అభయహస్తం" అమలు చేయండి

- **ఇళ్ల స్థలాలు, పెన్షన్‌పై చర్యలు తీసుకోండి**
- **తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**
- **8 వారాల గడువు ఇస్తూ కీలక తీర్పు**
- **ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్న కోర్ట్**
- **న్యాయస్థానం తీర్పుపై ఉద్యమకారుల హర్షం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రకటించిన "అభయహస్తం" పథకం అమలుపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వానికి స్పష్టమైన గడువు విధించింది. అర్హులైన ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇళ్ల స్థలం, నెలకు సుమారు రూ.25,000 పెన్షన్ అందించాలన్న హామీపై చర్యలు తీసుకోవాలని కోర్టు సూచించింది. ఈ అంశంపై దాఖలైన పిటిషన్లను జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి ధర్మాసనం విచారించింది. పలువురు తెలంగాణ ఉద్యమకారులు తమకు ఎన్నికల సమయంలో ప్రకటించిన ప్రయోజనాలు ఇప్పటివరకు అమలు కాలేదని కోర్టును ఆశ్రయించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం హామీల అమలులో ఆలస్యం చేస్తోందని వారు ఆరోపించారు.

**ఎనిమిది 8 వారాల గడువు**

విచారణ సందర్భంగా హైకోర్టు ప్రభుత్వాన్ని 8 వారాల్లోగా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అర్హులైన వారికి 250 గజాల ఇళ్ల స్థలాలు కేటాయించే విధంగా నిర్ణయం తీసుకోవాలని, అలాగే నెలవారీ పెన్షన్ మంజూరు చేసే ప్రక్రియ ప్రారంభించాలని సూచించింది. ఎన్నికల హామీ మేరకు సంక్షేమ ప్రయోజనాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని కోర్టు స్పష్టం చేసింది. హామీల అమలులో ఎందుకు ఆలస్యం జరుగుతోందో కోర్టుకు వివరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇప్పటికే కొందరికి మాత్రమే ప్రయోజనాలు ఇచ్చి ఉంటే, వారికి ఏ ప్రమాణాల ఆధారంగా ఎంపిక చేశారో వివరించాలని కూడా కోరింది. ఈ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కోర్టు అభిప్రాయపడింది.

**ప్రజల నమ్మకానికి భంగం కలగకూడదు**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకపోతే ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల హామీలు కేవలం మాటలు కాకుండా అమలు చేయాల్సిన బాధ్యతగా భావించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించి, అవసరమైతే జీవో జారీ చేసి అమలు చర్యలు చేపట్టాలని కోర్టు సూచించింది. అర్హుల గుర్తింపులో స్పష్టత ఉండాలని, ఎవరికి ప్రయోజనం అందుతుందో ప్రజలకు తెలియజేయాలని తెలిపింది.

**ఉద్యమకారుల్లో ఆనందం**

హైకోర్టు ఆదేశాలు తెలంగాణ ఉద్యమకారుల్లో ఊరటను కలిగించాయి. రాష్ట్ర సాధన కోసం పోరాడిన తమకు తగిన గుర్తింపు, సంక్షేమం కల్పించాలన్న డిమాండ్ చాలాకాలంగా పెండింగ్‌లో ఉంది. ఇప్పటివరకు అమలు విషయంలో స్పష్టత లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతుండేది. ఇప్పుడు కోర్టు గడువు విధించడంతో ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వచ్చే రెండు నెలలు కీలకంగా మారాయి. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అన్నదానిపై అందరి దృష్టి ఉంది.

"అభయహస్తం" పథకం అమలు ప్రభుత్వం ముందున్న ముఖ్యమైన అంశంగా మారింది. అర్హులైన ఉద్యమకారుల వివరాలు సేకరించడం, అర్హత ప్రమాణాలు ఖరారు చేయడం, స్థలాల కేటాయింపు, పెన్షన్ మంజూరు వంటి అంశాలపై సమగ్ర కార్యాచరణ అవసరం ఉంది. ఆర్థిక భారం, భూసేకరణ, పరిపాలనా విధానాల పరంగా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ హామీలు అమలు చేయడంలో ఇబ్బందులు ఉంటే వాటి గురించి కూడా కోర్టుకు వివరించాలని ఆదేశాలు ఉన్న నేపథ్యంలో, ప్రభుత్వం సమగ్ర నివేదిక సమర్పించాల్సి ఉంది.

ఇప్పటికే పలువురు ఉద్యమకారులు తమకు ప్రయోజనాలు అందలేదని చెబుతున్నారు. మరికొందరికి పరిమితంగా మాత్రమే ప్రయోజనాలు లభించాయని సమాచారం. ఈ నేపథ్యంలో అర్హుల జాబితా, అమలు విధానం, గడువు వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. హైకోర్టు ఆదేశాలతో ఇప్పుడు ఈ అంశం మరోసారి ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల హామీల అమలు విషయంలో ప్రభుత్వం ఎలా ముందుకు సాగుతుందో చూడాల్సి ఉంది. 8 వారాల గడువు పూర్తయ్యేలోపు స్పష్టమైన నిర్ణయం వెలువడే అవకాశముంది. మొత్తంగా చూస్తే, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన ఈ కేసు ప్రభుత్వానికి ఒక పరీక్షగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు త్వరితగతిన చర్యలు తీసుకుంటే ఉద్యమకారులకు ఉపశమనం లభించే అవకాశం ఉంది. లేకపోతే ఈ విషయం మరింత చర్చకు దారితీసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఇరాన్ విడిచిపెట్టండి

**మొదటిపేజీ తరువాయి**

దాడి చేయొచ్చన్న అంచనాల మధ్య, స్థానిక విద్యార్థులు, పౌరులలో ఆందోళనలు చెలరేగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం (ఇండియన్ ఎంబసీ) తాజాగా ఒక అడ్వైజరీని జారీ చేసింది. ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు తక్షణమే ఆ దేశాన్ని వీడాలని సూచించింది. ఈ అడ్వైజరీ జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు కొనసాగింపుగా వచ్చింది.

**భారత ఎంబసీ అడ్వైజరీ వివరాలు**

ఇరాన్‌లో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా, భారత ఎంబసీ తన అడ్వైజరీలో పలు కీలక సూచనలు చేసింది. "ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారతీయులు - విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు - కమర్షియల్ విమానాలతో సహా అందుబాటులో ఉన్న అన్ని ప్రయాణ మార్గాల ద్వారా తక్షణమే ఇరాన్‌ను విడిచిపెట్టాలి" అని స్పష్టం చేసింది. భారతీయ పౌరులు, భారత సంతతి వ్యక్తులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, ఆందోళనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించింది. అలాగే, ఇరాన్‌లోని భారత ఎంబసీతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరపాలని, తాజా పరిణామాల కోసం స్థానిక మీడియాను గమనిస్తూ ఉండాలని పేర్కొంది.

మరింత వివరంగా చూస్తే, భారతీయులంతా తమ పాస్‌పోర్ట్‌లు, ఐడీ కార్డులతో సహా ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని ఎంబసీ సూచించింది. ఎలాంటి సహాయం కోసమైనా భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని, ఇప్పటివరకు ఎంబసీ వద్ద మీ పేర్లు నమోదు చేసుకోకపోతే వెంటనే రిజిస్టర్ చేయించుకోవాలని కోరింది. ఈ అడ్వైజరీ ఇరాన్‌లో ఉన్న సుమారు 5,000 మంది భారతీయ విద్యార్థులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులకు ప్రత్యేకంగా ఉపయోగపడనుంది. భారత్‌ఇరాన్ మధ్య సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలు బలమైనవి కావడంతో, అక్కడి భారతీయుల సంఖ్య గణనీయంగా ఉంది.

**ఇరాన్-అమెరికా మధ్య టెన్షన్ల నేపథ్యం**

ఇరాన్‌అమెరికా మధ్య టెన్షన్లు ఇప్పుడు కొత్తవి కావు. ఇవి దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్ అణు కార్యక్రమం చుట్టూ ఈ వివాదాలు తిరుగుతున్నాయి. 2015లో ఒబామా అధ్యక్షత్వంలో ఇరాన్‌తో జాయింట్ కాంప్రెహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ (జేసీపీఓఏ) అనే అణు ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఇరాన్ తన అణు కార్యక్రమాలను పరిమితం చేస్తుందని, బదులుగా అమెరికా, యూరప్ దేశాలు ఆర్థిక ఆంక్షలను ఎత్తివేస్తాయని నిర్ణయమైంది. అయితే, 2018లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందం నుంచి తప్పుకుని, ఇరాన్‌పై మళ్లీ ఆంక్షలు విధించారు. దీంతో టెన్షన్లు మరింత పెరిగాయి.

ప్రస్తుతం ఇరాన్‌అమెరికా మధ్య అణు చర్చలు ఇంత వరకూ కొలిక్కి రాలేదు. వియన్నాలో జరుగుతున్న ఈ చర్చలు విఫలమైతే, ఇరాన్‌పై దాడికి వెనుకాడబోమని ట్రంప్ సంకేతాలిచ్చారు. ట్రంప్ పరిపాలనలో అమెరికా ఇరాన్‌పై గరిష్ఠ ఒత్తిడి (మ్యాక్సిమమ్ ప్రెషర్) వ్యూహాన్ని అనుసరిస్తోంది. ఇరాన్ అణు ఆయుధాలు తయారు చేస్తోందన్న ఆరోపణలు, ఇరాన్ ఆయిల్ ఎగుమతులపై ఆంక్షలు ఈ టెన్షన్లకు మూలం. ఇరాన్ మాత్రం తన అణు కార్యక్రమం శాంతియుతమైనదని, విద్యుత్ ఉత్పత్తి కోసమే అని వాదిస్తోంది. అయితే, యురేనియం ఎన్‌రిచ్‌మెంట్ స్థాయిని 60 శాతం వరకు పెంచడంతో అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఆందోళన చెందుతున్నాయి.

**అమెరికా మిలటరీ మోహరింపు**

ఈ టెన్షన్ల నేపథ్యంలో అమెరికా పశ్చిమాసియా ప్రాంతంలో తన సైనిక బలగాలను బలోపేతం చేసింది. పలు విమాన వాహన నౌకలు (ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లు), జలాంతర్గాములు (సబ్‌మెరైన్స్), ఫైటర్ జెట్‌లను మోహరించింది. యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఆధ్వర్యంలో ఈ కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఇరాన్ స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ ద్వారా ఆయిల్ ఎగుమతులను అడ్డుకుంటుందన్న భయంతో అమెరికా ఈ చర్యలు తీసుకుంది. ఈ స్ట్రెయిట్ ప్రపంచ ఆయిల్ సరఫరాలో 20 శాతం ద్వారా ప్రయాణిస్తుంది, దీని అడ్డంకి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుంది.

# డీజీపీ గారూ... అవి ఫేక్ న్యూస్ క్లిప్పింగ్స్

**మొదటిపేజీ తరువాయి**

అవుతుండటంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో నిందితులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ అండదండలు ఉన్నాయా? అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

ఈ మేరకు తెలంగాణ డీజీపీని ట్యాగ్ చేస్తూ హరీశ్ రావు సోమవారం ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు.

"తెలంగాణ డీజీపీ గారూ, పోలీసులను, ప్రజలను రెచ్చగొట్టి, తప్పుదోవ పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా కొన్ని ఫేక్ న్యూస్ క్లిప్పులను ప్రచారంలోకి వదులుతున్నారు. ఇది నేరుగా సంస్థాగత విశ్వసనీయతపై చేస్తున్న దాడి. ఈ విషయంలో తెలంగాణ పోలీసులు తక్షణమే చర్యలు తీసుకుంటారా? లేదంటే ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ఇలాగే అడ్డుఅదుపు లేకుండా వదిలేస్తారా? ముఖ్యమంత్రి, హోంమంత్రి రేవంత్ రెడ్డి గారి కింద ఈ దుష్ప్రచారం చేస్తున్న వారికి రాజకీయ అండదండలు ఉన్నందువల్లే మీరు ఇలా ఎంపిక చేసుకుని మరీ మౌనంగా ఉంటున్నారా? పోలీసు శాఖ గురించి ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తున్న వారిపై



తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నాం" అంటూ హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# బీఆర్ఎస్ ఫెయిల్ అయింది.. జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

**మొదటిపేజీ తరువాయి**

ఆమె మాట్లాడుతూ, తనకు జోగులాంబ అమ్మవారు సెంటిమెంట్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఏ కార్యక్రమం మొదలైనా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా నుంచి ఎక్కువగా ప్రారంభమయ్యేదని అన్నారు.

కానీ భవిష్యత్తులో మనం ఏర్పాటు చేయబోయే పార్టీ మొదలు అన్నీ జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభం చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ఇక్కడి నడిగడ్డ ప్రజలు నిజాయతీపరులని, అలాగే ఈ గడ్డపై నుంచి ఏ కార్యక్రమం ప్రారంభించినా జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. పరిశ్రమలకు కరెంట్ ఇస్తున్నారు కానీ కష్టపడి పనిచేసే రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు.

జోగులాంబ అమ్మవారి దయతో గద్వాల జిల్లా నుంచే తెలంగాణ జాగృతి జైత్రయాత్ర ప్రారంభమైందని అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీని తాము గెలుచుకున్నామని వెల్లడించారు. కానీ వడ్డేపల్లిలో తాము గెలిచిన తర్వాత తమ వారిని అధికార పార్టీ వారు దగ్గరకు తీసుకున్నారని మండిపడ్డారు. అసలు గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని సవాల్ చేశారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని వారు ఎమ్మెల్యేగా ఉన్నారని మండిపడ్డారు.

సమాధానం చెప్పకుంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేస్తే ఆ మరుక్షణం తాను ఆ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయతీ, ధైర్యం ఉండాలని వ్యాఖ్యానించారు. మన ప్రాంతం నుంచే నీళ్లు పోతున్నాయి కానీ మనకు మాత్రం అందడం లేదని అన్నారు.

నడిగడ్డ ప్రాంతానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేసిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వంలో ఎవరున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ప్రభుత్వాలతో పని చేయించడం కోసమే కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్ని



కల సమయంలో ఎవరు ఏమిచ్చినా తీసుకోవాలని, కానీ పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు.

త్వరలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వస్తున్నాయని, అప్పుడు డబ్బులు ఇచ్చినా తీసుకోవాలని, కానీ మీకోసం కొట్లాడే జాగృతి అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు చెప్పిందని గుర్తు చేశారు. కానీ ఈ హామీలు ఇప్పటి వరకు నెరవేర్చలేదని అన్నారు.

# పెళ్లి పేరుతో మోసాలు..
# అమ్మాయిలూ జాగ్రత్త!



**మొదటిపేజీ తరువాయి**

యువతులకు దగ్గరవుతున్నారు. "ఇంకా కొద్ది రోజుల్లో పెళ్లి కదా" అంటూ భావోద్వేగంగా ఒత్తిడి చేసి శారీరక సంబంధానికి దారి తీస్తున్న ఘటనలు బయటపడుతున్నాయని ఆయన చెప్పారు.తమ కోరిక తీరిన తర్వాత అసలు రంగు బయటపెడుతున్నారని, పెళ్లి పీటలు ఎక్కాలంటే అదనపు కట్నం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. భారీ మొత్తంలో డబ్బు ఇవ్వకపోతే పెళ్లి రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని చెప్పారు. కొందరు నేరుగా డబ్బు డిమాండ్ చేస్తుండగా, మరికొందరు పరోక్షంగా ఒత్తిడి తెస్తున్నారని వెల్లడించారు.

**పరువు భయంతో మౌనం**

నిశ్చితార్థం జరిగిపోయి, బంధుమిత్రులందరికీ విషయం తెలిసిపోయిన తర్వాత పెళ్లి ఆగిపోతే పరువు పోతుందనే భయంతో చాలామంది యువతులు, వారి కుటుంబాలు ఫిర్యాదు చేయడానికి వెనకడుగు వేస్తున్నారని సీపీ తెలిపారు. ఇదే పరిస్థితిని ఉపయోగించుకుని మోసగాళ్లు మరింత వేధింపులకు పాల్పడుతున్నారని చెప్పారు.సమాజం ఏమనుకుంటుందో అనే ఆలోచనతో మౌనంగా ఉంటే జీవితాంతం బాధ అనుభవించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. పరువు కంటే భవిష్యత్తు ముఖ్యమని, తప్పు చేసిన వారిని శిక్షించేందుకు ధైర్యంగా ముందుకు రావాలని సూచించారు.

**నిశ్చితార్థం అయినా అప్రమత్తత అవసరం**

నిశ్చితార్థం జరిగిందని నిర్లక్ష్యం చేయకూడదని సీపీ స్పష్టం చేశారు. పెళ్లి జరిగే వరకు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పెద్దలు కుదిర్చిన సంబంధం కాబట్టి అన్నింటికీ ఒప్పుకోవడం సరికాదని చెప్పారు. అబ్బాయి ప్రవర్తన, స్నేహితులు, అలవాట్లు వంటి అంశాలపై కుటుంబ సభ్యులు ఆరా తీయాలని సూచించారు.పెళ్లికి ముందు ఏకాంతంగా కలవాలని, శారీరక సంబంధానికి ఒత్తిడి చేస్తే అది ప్రమాద సంకేతమని గుర్తించాలని అన్నారు. అలాంటి ఒత్తిడిని ధైర్యంగా తిరస్కరించాలని చెప్పారు. నిజంగా మంచివాడైతే పెళ్లి వరకు గౌరవంతో ఎదురుచూస్తాడని పేర్కొన్నారు.

**షీ టీమ్స్‌కు పెరుగుతున్న ఫిర్యాదులు**

ఇటీవలి కాలంలో ఇలాంటి కేసులు పెరుగుతున్నాయని సీపీ తెలిపారు. ప్రేమ పేరుతో మోసం చేసే ఘటనలతో పాటు, కట్నం కోసం నిశ్చితార్థం తర్వాత బెదిరించే సంఘటనలు కూడా ఎక్కువవుతున్నాయని చెప్పారు. బాధితులు ముందుకు వస్తేనే చట్టపరమైన చర్యలు తీసుకోగలమని పేర్కొన్నారు.ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. ఎటువంటి భయం లేకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

**వెంటనే ఫిర్యాదు చేయండి**

ఇలాంటి పరిస్థితులు ఎదురైతే వెంటనే హైదరాబాద్ షీ టీమ్స్ వాట్సాప్ నెంబర్ 9490616555కు సమాచారం ఇవ్వాలని, లేదా డయల్ 100కు కాల్ చేయాలని సీపీ సూచించారు. అవసరమైతే సమీప పోలీస్ స్టేషన్‌ను కూడా సంప్రదించవచ్చన్నారు.ఈ తరహా మోసాలను అరికట్టడంలో కుటుంబ సభ్యుల పాత్ర కూడా ముఖ్యమని సీపీ తెలిపారు. యువతులపై అనవసర ఒత్తిడి తేవకుండా, వారి మాట వినాలని సూచించారు. పెళ్లి వ్యవహారాల్లో తొందరపడకూడదని, సరైన సమాచారం సేకరించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని చెప్పారు.

**జాగ్రత్తే రక్షణ**

పెళ్లి అనేది జీవితాంతం బంధం. అలాంటి నిర్ణయంలో తొందరపడితే భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉందని సీపీ పేర్కొన్నారు. భావోద్వేగాలకు లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని, అనుమానం వచ్చిన వెంటనే పెద్దలకు లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మొత్తంగా చూస్తే, పెళ్లి పేరుతో జరుగుతున్న మోసాలపై పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. యువతులు ధైర్యంగా ముందుకు వస్తేనే మోసగాళ్లను కట్టడి చేయగలమని సీపీ స్పష్టం చేశారు. భయపడకుండా ఫిర్యాదు చేయడం ద్వారా మరిన్ని కుటుంబాలను కూడా ఇలాంటి మోసాల నుంచి కాపాడవచ్చని ఆయన తెలిపారు.

# రేపటి నుంచి తెలంగాణ ఇంటర్ పరీక్షలు

**మొదటిపేజీ తరువాయి**

వరకు కొనసాగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణపై అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇంటర్ బోర్డు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి కృష్ణాదిత్య మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాబోతున్నారని తెలిపారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,07,949 మంది ఉన్నారని వివరించారు. గత సంవత్సరాలతో పోలిస్తే ఈసారి పరీక్షలు మరింత క్రమబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

**రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలు**


రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలిపి 1,495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 404 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 221 ఎయిడెడ్ కాలేజీలు, 863 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అదనంగా 7 ఇతర విద్యాసంస్థలను కూడా పరీక్షా కేంద్రాలుగా గుర్తించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రైవేట్ కాలేజీల్లో ఎక్కువగా సెంటర్లు ఏర్పాటు చేయగా, ఇతర జిల్లాల్లో ఎక్కువగా ప్రభుత్వ కళాశాలలకే ప్రాధాన్యం ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సౌకర్యంగా ఉండేలా సమీప ప్రాంతాల్లోనే కేంద్రాలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

**సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు**

మాస్ కాపీయింగ్‌కు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతి కేంద్రంలో ప్రత్యేక నిఘా బృందాలు ఉంటాయి. అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకునేలా పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేశారు. అలాగే ప్రతి పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్లు నియమించారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**సమయానికి రావాలని సూచన**

విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు కనీసం అరగంట ముందుగానే చేరుకోవాలని ఇంటర్ బోర్డు సూచించింది. పరీక్ష ప్రారంభమైన తర్వాత ఐదు నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చిన వారికి అనుమతి ఇస్తామని చెప్పారు. అయితే ఆలస్యంగా రావడం వల్ల విద్యార్థులు ఆందోళనకు గురయ్యే అవకాశం ఉందని, అందువల్ల నిర్ణీత సమయానికి ముందే చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత మధ్యాహ్నం 12 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులను బయటకు అనుమతించరని స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాలు కూడా ఆ సమయం వరకు బయటకు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు.



**28,500 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో**

**పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. వీరితో పాటు అదనపు సిబ్బంది, సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు కూడా విధుల్లో ఉంటారు. ప్రతి కేంద్రంలో కనీసం అవసరమైన సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడటానికి విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకున్నారు. అలాగే రవాణా సౌకర్యాల విషయంలో రవాణా శాఖతో చర్చలు జరిపారు. పరీక్షా సమయాల్లో ట్రాఫిక్ సమస్యలు రాకుండా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది.**

**మాల్ ప్రాక్టీస్‌పై ప్రత్యేక కమిటీ**

పరీక్షల సమయంలో ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే లేదా మాల్ ప్రాక్టీస్‌కు సంబంధించిన ఫిర్యాదులు వస్తే వెంటనే నిర్ణయం తీసుకునేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ పరీక్షా కేంద్రాల నుంచి వచ్చే నివేదికలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటుంది. గతంలో జరిగిన కొన్ని ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. విద్యార్థులు కూడా నియమాలు పాటించాలని అధికారులు కోరుతున్నారు.

**హాల్ టికెట్లపై స్పష్టత**

ఈసారి హాల్ టికెట్ల విషయంలో కొన్ని వివాదాలు తలెత్తిన నేపథ్యంలో అధికారులు స్పష్టతనిచ్చారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో ఏ విద్యార్థిని పరీక్షలకు దూరం చేయబోమని తెలిపారు. అందరికీ హాల్ టికెట్లు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. కోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు కూడా ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఎలాంటి అడ్డంకులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**విద్యార్థులకు సూచనలు**

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్, అవసరమైన స్టేషనరీ సామగ్రి వెంట తీసుకురావాలి. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాలకు తీసుకురావడం నిషేధం. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉండాలని, ఆందోళన చెందవద్దని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సూచిస్తున్నారు. సమయానికి నిద్రపోవడం, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం అవసరమని చెప్పారు.

**తల్లిదండ్రుల సహకారం అవసరం**

పరీక్షల సమయంలో తల్లిదండ్రులు కూడా పిల్లలకు మానసిక బలం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. అధిక ఒత్తిడి కలగకుండా ప్రోత్సహించాలని సూచించారు. పరీక్ష ఫలితాలపై కాకుండా విద్యార్థుల ప్రయత్నాన్ని మెచ్చుకోవాలని తెలిపారు.

**కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ప్రారంభం**

మొత్తంగా చూస్తే ఈసారి తెలంగాణ ఇంటర్ పరీక్షలు కట్టుదిట్టమైన భద్రతా చర్యల మధ్య ప్రారంభమవుతున్నాయి. దాదాపు పది లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో సంబంధం ఉన్న ఈ పరీక్షలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. రేపటి నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలు విద్యార్థుల జీవితాల్లో కీలక దశ. శ్రమించి చదివిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని అందరూ కోరుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పరీక్షల వాతావరణం నెలకొంది. అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో పరీక్షలు సజావుగా సాగాలని ఆశిస్తున్నారు.

# కర్రెగుట్టల్లో భారీ కూంబింగ్

**మొదటిపేజీ తరువాయి**

బలగాలు వ్యూహాత్మకంగా ముందుకు కదులుతూ మావోయిస్టుల కోసం వేటను తీవ్రతరం చేశాయి. ఆ పార్టీకి చెందిన కీలక నేతలు ప్రస్తుతం వేళ్ల మీద లెక్కబెట్టేంత సంఖ్యలో మాత్రమే ఉన్నారంటున్న పోలీస్ వర్గాలు వారిని న్యూట్రల్ చేస్తే ఆపరేషన్ కగార్ సంపూర్ణమవుతుందని చెబుతున్నాయి. మార్చి 31వ తేదీలోపు లక్ష్యాన్ని సాధిస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాయి. చాలాకాలంగా భద్రతా బలగాల రాడార్‌లో ఉన్న మావోయిస్టు పార్టీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డితోపాటు మరో 16 మంది మావోయిస్టులు లొంగిపోయినట్టు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు దీనిని నిర్ధారించలేదు. అదే సమయంలో ఈ వార్తల్లో నిజం లేదనీ చెప్పలేదు. మావోయిస్టు పార్టీలో కీలకంగా ఉన్న ఈ ఇద్దరి లొంగుబాటుతో బలగాలు మిగిలిన వారి కోసం కర్రెగుట్టల్లో గాలింపును మరింత ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో డ్రోన్లను రంగంలోకి దింపాయి. అడవులను అణువణువు శోధిస్తున్నాయి. ఇక, మెటల్ డిటెక్టర్ల సహాయంతో మావోయిస్టులు ఐఈడీలతో ఏర్పాటు చేసిన మందుపాతరలను ఒక్కొక్కటిగా కనుక్కుంటూ వాటిని నిర్వీర్యం చేస్తూ బలగాలు ముందుకు కదులుతున్నాయి. మందుపాతరలను నిర్వీర్యం చేస్తున్న నేపథ్యంలో పేలుళ్ల శబ్దాలు అడవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. మావోయిస్టులు డోలీ, జెల్ల, తడపాల ప్రాంతాల్లోని అడవుల్లో తలదాచుకుని ఉన్నట్టుగా సమాచారం ఉండటంతో ఆ ప్రాంతాలను చుట్టుముడుతున్నాయి. కోబ్రా, డీఆర్‌జీ, కేంద్ర భద్రతా బలగాలు, ఛత్తీస్‌గడ్ పోలీసులు, గ్రే హౌండ్స్ పోలీసులు అన్ని వైపుల నుంచి కూంబింగ్‌ను తీవ్రతరం చేసిన క్రమంలో మరోసారి కర్రెగుట్టల్లో ఎన్‌కౌంటర్ జరగడం ఖాయమన్న అభిప్రాయం పోలీస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. కాగా, జనజీవన స్రవంతిలో కలవడానికి ముందుకొచ్చే మావోయిస్టుల కోసం మా తలుపులు తెరిచే ఉన్నాయంటూ పోలీస్ ఉన్నతాధికార వర్గాలు అంటున్నాయి. లొంగిపోవడానికి ఇదే సరైన సమయమని చెబుతున్న అధికారులు అజ్ఞాతం వీడి బయటకు వచ్చి ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస పథకాల ప్రయోజనాలను పొందాలని సూచిస్తున్నారు.

# నా పేరుతో సంస్థలు పెట్టొద్దు

**మొదటిపేజీ తరువాయి**

ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు.

తన పేరుతో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు ఎలాంటి గుర్తింపు, అనుమతి లేదనే విషయం అందరూ గుర్తించాలని అన్నారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ పరిధిలోనే చేయాలని కేటీఆర్ స్పష్టం చేశారు. తన పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను నిలిపివేయాలని, తనపై అభిమానం ఉన్నవాళ్లు బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేయాలని సూచించారు.



# గ్లోబల్ వాల్యూ హబ్‌గా హైదరాబాద్

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఐటీతో పాటు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్, ఏరోస్పేస్, తయారీ రంగం, ఫిన్‌టెక్, డీప్‌టెక్, రిటైల్ వంటి విభాగాల్లోనూ హైదరాబాద్‌ను "గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్"గా మార్చేందుకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. సోమవారం నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అంతర్జాతీయ బీమా సంస్థ 'ది హార్ట్‌ఫోర్డ్' ఏర్పాటు చేసిన 'హార్ట్‌ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్'ను మంత్రి శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. సుమారు 1.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ కేంద్రంలో దశలవారీగా 1200 మంది వరకు ఉద్యోగులు పనిచేయగల సామర్థ్యం ఉంది.

**హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన హార్ట్‌ఫోర్డ్ సంస్థ తన అంతర్జాతీయ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం నగర ప్రతిభకు, డిజిటల్ ఇంజినీరింగ్ రంగంలో తెలంగాణ స్థాయికి లభించిన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రిస్క్ అనాలిటిక్స్, ఆధునిక బీమా సేవల అభివృద్ధిలో హైదరాబాద్ పాత్ర మరింత బలపడుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతను 'రెడీ టూ వర్క్' మానవ వనరుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి వివరించారు. పరిశ్రమలతో అనుసంధానంగా శిక్షణా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి చర్యలు అమలు చేస్తున్నామని చెప్పారు. గ్లోబల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం నిర్మాణంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు.

**400కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు**

హైదరాబాద్‌లో ఇప్పటికే 400కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని మంత్రి తెలిపారు. వీటిలో మారియట్, మెక్‌డొనాల్డ్స్, యూబీఎస్, డాజన్, వాన్‌గార్డ్, ఎలీ లిల్లీ, హెచ్‌సీఏ హెల్త్‌కేర్, సిటిజన్స్ బ్యాంక్ వంటి ప్రముఖ అంతర్జాతీయ సంస్థలు ఉన్నాయి. ఈ సంస్థలను కేవలం బ్యాక్‌ఎండ్ ఆపరేషన్స్‌కే పరిమితం చేయకుండా, గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా అభివృద్ధి చేసేలా వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. పరిశోధన, అభివృద్ధి, డిజిటల్ సొల్యూషన్స్, డేటా అనలిటిక్స్ వంటి అధునాతన సేవలను హైదరాబాద్ నుంచే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**పారదర్శక పాలన**

పారదర్శక పాలన, సమర్థవంతమైన నాయకత్వం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో సంస్కరణలు, వేగవంతమైన అనుమతుల ప్రక్రియ, ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు - ఇవన్నీ తెలంగాణను పెట్టుబడిదారులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చాయని మంత్రి అన్నారు. ఈ కారణాల వల్లే హార్ట్‌ఫోర్డ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు రాష్ట్రాన్ని ఎంచుకుంటున్నాయని పేర్కొన్నారు.

**ఇంజినీరింగ్ ఎక్సలెన్స్ హబ్‌గా కొత్త కేంద్రం**

హార్ట్‌ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్ యూఎస్‌లోని హార్ట్‌ఫోర్డ్, చికాగో, షార్లెట్, కొలంబస్ నగరాల్లో ఉన్న టెక్నాలజీ కేంద్రాలకు అనుబంధంగా పనిచేస్తుంది. ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ వంటి కీలక రంగాల్లో ఈ కేంద్రం దృష్టి సారించనుంది. భవిష్యత్తులో ఇది 'ఇంజినీరింగ్ ఎక్సలెన్స్ హబ్'గా ఎదుగుతుందని మంత్రి తెలిపారు. ఈ కేంద్రం ద్వారా స్థానిక ప్రతిభకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు లభిస్తాయని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

# గుడిహత్నూర్‌లో బీజేపీ నిరసన



- రాష్ట్రంలో రామరాజ్య ప్రభుత్వం వస్తుందని పతంగే బ్రహ్మానంద్ వ్యాఖ్య

**డిడి9 వార్త గుడిహత్నూర్:**

రాష్ట్రంలో బీజేపీ రామరాజ్య ప్రభుత్వం ఏర్పడుతుందని పతంగే బ్రహ్మానంద్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గుడిహత్నూర్ మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పతంగే బ్రహ్మానంద్ రాష్ట్రంలో హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా సంఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక శాసనసభ్యుడిపై జరిగిన దాడి, బాన్సువాడలో హిందువులపై జరిగిన ఘటనలను ఖండిస్తూ, నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడి తప్పులను ప్రశ్నిస్తే శాసనసభ్యుడిపై దాడి జరుగుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం. తప్పుడు హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం ఎక్కువకాలం నిలవదు. ప్రజలు మార్పు కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో వచ్చే ప్రభుత్వం రామరాజ్య స్ఫూర్తితో పనిచేసే బీజేపీ ప్రభుత్వమే" అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ లక్ష్మణ్, ఆడే సునీల్ కుమార్, విజయ్ కుమార్, మండల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.







# పరీక్షలపై జాగ్రత్తలు తీసుకుంటేనే విజయం సాధ్యం

- విద్యార్థినులకు సూచనలు చేసిన మాజీ న్యాయమూర్తి ఎం.ఏ. సలీం

**బాన్సువాడ, ఫిబ్రవరి 23(డిడి9 వార్త):**



కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో ఉన్న ప్రభుత్వ సాంఘిక గురుకుల మహిళా పాఠశాల/కళాశాలలో సోమవారం పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల & కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్, మాజీ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఎం.ఏ. సలీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.ఏ. సలీం మాట్లాడుతూ పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినులు సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా, పూర్తి ఏకాగ్రతతో ప్రశ్నాపత్రాన్ని చదివి సమాధానాలు రాయాలని చెప్పారు. సమయపాలన పాటించడం, సులభమైన ప్రశ్నలతో ప్రారంభించడం, చివరిలో సమాధానాలను పునఃపరిశీలించడం వంటి ముఖ్యమైన సూచనలు అందించారు. క్రమశిక్షణ, ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉంటే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ బాన్సువాడ డివిజన్ అధ్యక్షులు వడ్ల నారాయణ చారి మాట్లాడుతూ విద్యార్థినులు చదువుపై దృష్టి సారించి, ఇతర విషయాలను పక్కన పెట్టి పూర్తి ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే విజయాన్ని అందుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థినులకు అవసరమైన సలహాలు అందిస్తూ బెస్ట్ ఆఫ్ లక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా సలహాదారులు భాగ్యలక్ష్మి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు గడువు పొడిగింపు

- ఫిబ్రవరి 27 వరకు అవకాశం

**కామారెడ్డి, ఫిబ్రవరి 23(డిడి9 వార్త):**



జిల్లాలో పత్తి సాగు చేసిన రైతులకు ఊరట కలిగించే నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. రైతుల సౌకర్యార్థం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా నిర్వహిస్తున్న పత్తి కొనుగోలు ప్రక్రియకు గడువు పొడిగించినట్లు వెల్లడించారు. రైతులు తమ పత్తిని ఈ నెల ఫిబ్రవరి 27 లోపు సమీప సీసీఐ కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవచ్చని సూచించారు. నిర్ణీత గడువు అనంతరం పత్తి కొనుగోళ్లకు ఎటువంటి పొడిగింపు ఉండదని స్పష్టం చేశారు. కాబట్టి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ పత్తిని గడువు ముగియకముందే విక్రయించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# రుద్రూరులో పోలీసుల నిర్లక్ష్యంపై న్యాయవాదుల ఆగ్రహం






- ఎస్సై సాయన్న సస్పెన్షన్‌కు డిమాండ్ – సీఐ కృష్ణ క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు

**బాన్సువాడ, ఫిబ్రవరి 23(డిడి9 వార్త):**

రుద్రూర్ మండల కేంద్రంలో న్యాయవాది కళ్యాణిపై జరిగిన ఘటనపై పోలీసుల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రుద్రూరు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఎస్సై సాయన్నను వెంటనే సస్పెండ్ చేసి, నిందితులకు సపోర్ట్ చేసినందుకు ఆయనపై కూడా కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల ప్రకారం తగిన సెక్షన్లు నమోదు చేయకుండా చిన్న సెక్షన్లతో కేసు నమోదు చేసి త్వరితగతిన కోర్టుకు పంపించడం అన్యాయమని న్యాయవాదులు ఆరోపించారు. ఇది కేసును నీరుగార్చే ప్రయత్నంగా భావిస్తున్నామని తెలిపారు. న్యాయవాది కళ్యాణికి న్యాయం చేయడంలో ఎస్సై సాయన్నతో పాటు పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. రుద్రూరు పోలీస్ స్టేషన్‌లో చట్ట ప్రకారం విధులు నిర్వర్తించడం లేదని, అమాయకులపై తప్పుడు కేసులు మోపుతున్నారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. నిందితులకు సపోర్ట్ చేసిన అధికారులపై కూడా సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర, దేశవ్యాప్తంగా బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

**సీఐ కృష్ణ తీరుపై ఆగ్రహం**

ధర్నా సందర్భంగా సీఐ కృష్ణ న్యాయవాదులతో దురుసుగా వ్యవహరించారని ఆరోపిస్తూ, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఐ కృష్ణ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. న్యాయం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న న్యాయవాదులను అవమానించడం సిగ్గుచేటని వారు అన్నారు. అనంతరం ఏసీపీ ఘటనాస్థలికి చేరుకుని న్యాయవాదులతో మాట్లాడి, న్యాయవాది కళ్యాణికి న్యాయం జరుగుతుందని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాములు, ప్రధాన కార్యదర్శి సాగర్, ఉపాధ్యక్షులు వి.ఆర్. దేశాయ్, సీనియర్ అడ్వకేట్లు పోశెట్టి శ్రీధర్, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో 83 దరఖాస్తులు స్వీకరణ

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, ఫిబ్రవరి 23(డిడి9 వార్త):**

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఓర్పుగా విన్న కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులకు వెంటనే పంపిస్తూ తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 83 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. భూ సమస్యలు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల బిల్లులు చెల్లింపులు కాలేదన్న ఫిర్యాదులు, పంచాయతీ, డీఆర్డీవో, డిడబ్ల్యూవో తదితర శాఖలకు సంబంధించిన అర్జీలు స్వీకరించినట్లు వెల్లడించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారుల సమస్యలకు శీఘ్ర పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓ వీణ, సీఈఓ చందర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రుద్రూరులో పోలీసు కవాతు

- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు: పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య హెచ్చరిక
- జేఎన్సీ కాలనీలో పోలీస్ పికెట్ ఏర్పాటు

**రుద్రూరు, ఫిబ్రవరి 23(డిడి9 వార్త):** నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని జేఎన్సీ కాలనీలో ఆదివారం చోటుచేసుకున్న ఘర్షణ నేపథ్యంలో సోమవారం గ్రామంలో పోలీసులు కవాతు నిర్వహించారు. మహిళా న్యాయవాదిపై ఒక వర్గానికి చెందిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలతో ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత తారాస్థాయికి చేరుకుంది. ఘటనపై ఇరువర్గాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాయి. పరిస్థితిని సమీక్షించేందుకు పి. సాయి చైతన్య స్వయంగా రుద్రూరుకు చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాంతి పరిరక్షణలో ప్రజలందరూ సహకరించాలని కోరారు. సీపీ వెంట బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, ఎస్సై సాయన్నతో పాటు పోలీసులు పాల్గొన్నారు. గ్రామంలో ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని అధికారులు తెలిపారు.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

**బీర్కూర్, ఫిబ్రవరి 23(డిడి9 వార్త):**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా కర్రోళ్ల విఠబాయి (భర్త సాయిలు)కు మంజూరైన ఇంటి నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనిధి మరియు సర్పంచ్ అరిగే ధర్మతేజ ఇంటి స్థలంలో ముగ్గు వేసి శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. అనంతరం అధికారులు లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న గృహ నిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకుని త్వరితగతిన ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మెహబూబ్, ఏఈ జగదీష్, పంచాయతీ కార్యదర్శి గంగారం, వార్డు సభ్యురాలు అరిగే గాయత్రి, వార్డు సభ్యులు ఆనంద్, కాజా మొయినుద్దీన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మహ్మద్ రఫీ, చిన్న రాములు, సత్యకిరణ్, రాము, మారుతి, డీజే ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



# భైరాపూర్‌లో ఉచిత కంటి పరీక్షల శిబిరం

- 25 మందికి మోతిబిందు గుర్తింపు

**బీర్కూర్, ఫిబ్రవరి 23(డిడి9 వార్త):**

మండలంలోని భైరాపూర్ గ్రామంలో సోమవారం ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. బోధన్ లయన్స్ క్లబ్ హాస్పిటల్ వారి సహకారంతో లయన్స్ క్లబ్ బీర్కూర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శిబిరంలో మొత్తం 86 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వీరిలో 25 మందికి మోతిబిందు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆ రోగులను శస్త్రచికిత్స కోసం బోధన్‌కు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు అజయ్ సర్, బీర్కూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలే రమేష్, క్యాంప్ ఇంచార్జ్ హన్మంతు రావు పటేల్, ఎల్ఐసి రాములు, భరత్ తదితరులతో పాటు గ్రామ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.



# జిపి వర్కర్ కుటుంబానికి ఆర్థిక సహాయం.

**డిడి9 వార్త గుడిహత్నూర్ :**

మండలకేంద్రంలోని గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన సుద్దాల లింగన్న కుటుంబానికి గ్రామ సర్పంచ్ ఆడే శీలా గ్రామపంచాయతీ తరపున రూపాయలు ఐదువేల నగదు ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలోని ప్రతి కార్మికుడి కష్టసుఖాలలో తోడు ఉంటానని అన్నారు. వారికి ఏ ఆపద వచ్చిన గ్రామపంచాయతీ తరపున ఆదుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లాందాడే నిఖిల్ వార్డు మెంబర్ అవినాష్ కారోబారి అమీన్ అలీ పాల్గొన్నారు.



# 48 గంటల్లోనే చోరీ కేసు ఛేదన

- **నిందితుల అరెస్ట్, ఆభరణాల స్వాధీనం**

**ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 23(డిడి9 వార్త):**



ఎల్లారెడ్డి మండలంలో జరిగిన ఇంటి చోరీ కేసును పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దొంగిలించిన వెండి, బంగారు ఆభరణాలు మరియు నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసును సమర్థవంతంగా ఛేదించిన పోలీస్ బృందాన్ని జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర అభినందించారు.లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన మెరుగు నిర్మల (35) ఫిబ్రవరి 20న ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం ఇంట్లో ఇనుప పెట్టెలో దాచిన సుమారు 40 తులాల వెండి ఆభరణాలు, 6 గ్రాముల బంగారు ఆభరణాలు మరియు రూ.2,16,000 నగదు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో దొంగిలించారని పేర్కొన్నారు.ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, డీఎస్పీ పర్యవేక్షణలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి సీసీటీవీ దృశ్యాలను సేకరించి, సాంకేతిక ఆధారాలను విశ్లేషించారు. దర్యాప్తులో భాగంగా ఎల్లారెడ్డి పట్టణంలోని ఓ గోల్డ్ షాప్‌కు ఆభరణాలు అమ్మడానికి వచ్చిన ఇద్దరిని అనుమానాస్పదంగా గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులు పుర్రా మమత (35), పుర్రా సాయిలు (50) ఇద్దరూ లింగారెడ్డిపేట గ్రామానికి చెందినవారే. వారి వద్ద నుండి కాళ్ల కడియాలు సుమారు 40 తులాలు, కాళ్ల పట్ట గొలుసులు సుమారు 25 తులాలు, బంగారు కమ్మ బుట్టలు సుమారు 6 గ్రాములు, బంగారు మాటీలు సుమారు 3 గ్రాములు, రెండు వెండి ఉంగరాలు సుమారు 1 తులం మరియు రూ.40,000 నగదు స్వాధీనం చేసుకున్నారు.కేసును ఎల్లారెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. రాజారెడ్డి, ఎస్సై బి. మహేష్ మరియు సిబ్బంది సమర్థవంతంగా విచారించి వేగంగా ఛేదించారు. పోలీసుల మెరుపు దర్యాప్తుతో బాధితురాలికి న్యాయం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు.

# హైకోర్టు తీర్పుపై మలిదశ ఉద్యమకారుల హర్షం

**బాన్సువాడ, ఫిబ్రవరి 23(డిడి9 వార్త):**





తెలంగాణ రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారులకు సంబంధించి హైకోర్టు వెలువరించిన తాజా తీర్పుపై బాన్సువాడ మలిదశ ఉద్యమకారుల ఫోరం హర్షం వ్యక్తం చేసింది. ఈ తీర్పు ఉద్యమంలో బలిదానాలు చేసిన అమరుల కుటుంబాలకు అంకితమని ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు.1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో 369 మంది, అలాగే 2001లో ప్రారంభమై 2009 నుండి 2014 వరకు కొనసాగిన మలిదశ ఉద్యమంలో 1200 మందికి పైగా అమరులైన నేపథ్యంలో, వారి కుటుంబాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఉద్యమకారులు హైకోర్టును ఆశ్రయించారు.
ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్‌లు మరియు ఇతర సౌకర్యాలు కల్పించాలంటూ తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఫోరం తెలిపింది. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోర్టు సూచించిందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ విజయసేన రెడ్డి తీర్పు వెలువరించగా, ఉద్యమకారుల తరపున న్యాయవాది కరుణాకర్ రెడ్డి వాదనలు వినిపించారు.న్యాయమైన తీర్పు ఇచ్చిన న్యాయమూర్తికి, సమర్థవంతంగా వాదించిన న్యాయవాదికి బాన్సువాడ ఉద్యమకారుల ఫోరం తరపున కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉడుత గంగాధర్ గుప్తా, జిల్లా వీడియో కన్వీనర్ దండు విజయ్ కుమార్, మండల అధ్యక్షులు గంజివార్ చందు, ఉపాధ్యక్షులు కాల్వ శ్యాం, ఎద్దుబల్లి కృష్ణ, భీమా నాయక్, ఏరావతి సాయిబాబా, అగ్గిలేవార్ దత్తు, భాస్కర్ గౌడ్, గైని గంగారాం, సాయి కుమార్ తదితరులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో నిజామాబాద్ సత్తా

- **సీపీ అభినందనలు**

**నిజామాబాద్, 23 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**




హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం, సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 16 నుండి 21 వరకు నిర్వహించిన 4వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 202'లో నిజామాబాద్ పోలీస్ సిబ్బంది అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ క్రీడల్లో జిల్లాకు చెందిన సిబ్బంది మొత్తం 4 స్వర్ణ, 7 రజత, 9 కాంస్య పతకాలను సాధించి జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచారు. సోమవారం జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ పి.సాయి చైతన్య విజేతలకు మెడల్స్ అందజేసి వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కఠినమైన విధులతో పాటు క్రీడల్లోనూ రాణించి జిల్లా పేరు నిలబెట్టినందుకు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (ఏఆర్) రామచంద్రరావుతో పాటు పతకాలు సాధించిన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బషీరాబాద్‌లో వైభవంగా మల్లన్న స్వామి కళ్యాణం, బోనాలు

**నిజామాబాద్ జిల్లా, 23 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామంలో మల్లన్న స్వామి జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గత పది సంవత్సరాలుగా యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా స్వామివారికి బోనాలు సమర్పించి, కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామమంతా భక్తిశ్రద్ధలతో మల్లన్న స్వామి నామస్మరణతో మారుమోగింది. అనంతరం భక్తులకు భారీగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామ అభివృద్ధి కమిటీ తో పాటు అన్ని కుల సంఘాల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దంపతులు బైకని జమున మహేష్, సంఘం పెద్దమనుషులు గంగాధర్, గంగన్న, మల్లేష్, సాగర్, ముకేశ్, రాజు, దిలీప్, గ్రామస్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.








# వర్ని మండలంలో అభివృద్ధి జోరు



- **కోట్ల రూపాయల పనులకు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన**

**బాన్సువాడ, ఫిబ్రవరి 23(డిడి9 వార్త):**









బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కోటయ్య క్యాంప్ గ్రామంలో రూ.45 లక్షలతో గ్రామ సంస్కార్ భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అలాగే రూ.33 లక్షల వ్యయంతో బాలికల హాస్టల్‌లో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఇక రూ.50 లక్షలతో కోటయ్య క్యాంప్ గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల గదులకు కరెంట్ వైరింగ్ మరమ్మత్తులు చేపట్టడంతో పాటు నాలుగు అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదే విధంగా రూ.21 లక్షలతో తెలంగాణ మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల నుండి ఆర్ అండ్ బి రహదారి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఎస్ఎన్ పురం గ్రామంలో రూ.10 లక్షలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డైనింగ్ హాల్ నిర్మాణానికి, రూ.12 లక్షలతో అంగన్వాడీ భవన నిర్మాణానికి కూడా భూమి పూజ నిర్వహించారు.ఈ అభివృద్ధి కార్యక్రమాలలో వర్ని మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు మరియు స్థానికులు పాల్గొన్నారు.



# పోతంగల్‌లో ట్రాక్టర్ యజమానుల ఆందోళన

**పోతంగల్, 23 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**

పోతంగల్ మండల కేంద్రంలోని మంజీర శివారు నుంచి ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ట్రాక్టర్ యజమానులు సోమవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన ఇసుక వాహనం యాప్‌లో పోతంగల్ ఇసుక పాయింట్ కనిపించకపోవడంతో రవాణా నిలిచిపోయిందని, దీనివల్ల తమ జీవనోపాధి దెబ్బతిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫైనాన్స్‌లో ట్రాక్టర్లు తీసుకున్న తాము, గత రెండు నెలలుగా పనులు లేక వాయిదాలు కట్టలేక పోతున్నామని, కుటుంబ పోషణ కూడా భారంగా మారిందని వాపోయారు. వెంటనే ఆన్‌లైన్ యాప్‌లో పోతంగల్ ఇసుక రీచ్‌ను అందుబాటులోకి తెచ్చి తమను ఆదుకోవాలని కోరుతూ తహసీల్దార్ గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు.



# పోలీస్ ప్రజావాణిలో 30 ఫిర్యాదుల స్వీకరణ

**నిజామాబాద్ జిల్లా, 23 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న సీపీ, మొత్తం 30 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో ఫోన్లో మాట్లాడి, ఫిర్యాదులను చట్టప్రకారం తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు ఎలాంటి పైరవీకారులు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి ద్వారా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా సీపీ స్పష్టం చేశారు.



# జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలీసుల అవగాహన కార్యక్రమం





**కామారెడ్డి, ఫిబ్రవరి 23(డిడి9 వార్త):**

జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కామారెడ్డిలో శుక్రవారం మాదక ద్రవ్యాలు, మైనర్ డ్రైవింగ్, సైబర్ నేరాలు మరియు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీస్ కళాబృందం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థులకు సామాజిక బాధ్యత, చట్టాలపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించబడింది.సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వాడకంలో జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. షీ టీమ్స్‌కు సంబంధించిన సమాచారం అందిస్తూ డబ్ల్యూపీసీ సౌజన్య, పీసీ భూమయ్యలు 8712686094 నంబర్ ద్వారా సహాయం పొందవచ్చని తెలిపారు.పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ యు. శేషరావు, పిసి సాయిలు మాటలు, పాటల ద్వారా విద్యార్థుల్లో చైతన్యం కలిగించారు. చిన్న తప్పిదాలు కూడా భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని, మంచి లక్ష్యంతో చదువుకుని ఉన్నత స్థానాలు సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెడ్ మాస్టర్ కరుణశ్రీ మేడం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన పోలీస్ సిబ్బందికి పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.





# తెలంగాణలో వడగళ్ల వాన బీభత్సం..
# పంటలకు తీవ్ర నష్టం..

**హైదరాబాద్, ఫిబ్రవరి 23 (డిడి9వార్త న్యూస్ ):-**
తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ రోజు(సోమవారం) అకస్మాత్తుగా భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి..వడగళ్లు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లగా, విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది.

**కాళేశ్వరంలో వడగళ్ల వాన బీభత్సం:-**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. భారీ గాలులు, వడగళ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

**సిద్దిపేట జిల్లాలో:-**
సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**నిర్మల్ జిల్లాలో:-**
నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి.

**ఒక్కసారిగా మారిన వాతావరణం:-**
ఈ వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పుడిప్పుడే ఎండ తీవ్రత పెరుగుతండగా.. ఒక్కసారిగా వడగళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన



వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే రైతులకు మాత్రం తీవ్ర నష్టం కలిగింది.

**రైతులకు భారీ నష్టం:-**
వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, కూరగాయల పంటలు, ఇతర వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వడగళ్ల వర్షంతో పంటలు నేలకూలిపోయాయి. అలాగే మరోవైపు ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు.

**అధికారుల అప్రమత్తత:-**
వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తమయ్యారు. నష్టాలను అంచనా వేయడానికి సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపడుతున్నారు. రైతులకు నష్టం జరిగిన ప్రాంతాల్లో నివేదికలు సేకరిస్తున్నారు.



## మందర్నాలో మన ఇసుక మన వాహనం ప్రారంభం

**బోధన్ , 23 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**
సాలూర మండలంలోని మందర్న గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఇసుక మన వాహనం ఆన్‌లైన్ సేవలను ఇన్చార్జ్ తహశీల్దార్ అనూష సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇసుక రవాణాలో అక్రమాలకు తావులేకుండా, సామాన్యులకు సైతం పారదర్శకమైన పద్ధతిలో ఇసుకను అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులందరూ ఈ ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇసుక బుకింగ్ ప్రక్రియను మరియు రవాణా నియమాలను అధికారులకు, గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మందర్నా సర్పంచ్ సావిత్రి గంగాధర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, జీపీఓ సంగమేశ్వర్, వీఆర్ఏ శంకర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధిపై సర్పంచులకు దిశానిర్దేశం



**బోధన్, 23 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**
బోధన్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతన సర్పంచులతో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ విట్టల్ పాల్గొని గ్రామాల అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన ఇసుక - మన వాహనం యాప్ ద్వారా సులభంగా అనుమతులు పొందవచ్చని ఆయన వివరించారు. ఈ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచులకు సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగయ్య, ఎంపీడీవో కిషోర్, ఎంపీవోతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఎడపల్లిలో ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్టు

**బోధన్, 23 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**
తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆశా కార్యకర్తలు పిలుపునిచ్చిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు సోమవారం మండలంలో ముందస్తు అరెస్టులు చేపట్టారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో నిర్వహించ తలపెట్టిన నిరసన ప్రదర్శనకు కార్యకర్తలు వెళ్లకుండా ఎడపల్లి పోలీసులు తెల్లవారుజాము నుంచే నిఘా పెట్టారు. ఇందులో భాగంగా ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాజమణి, నాయకులు దువ్వ పద్మ, రవికలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై ముత్యాల రమా మాట్లాడుతూ.. పై అధికారుల ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు అరెస్టులు నిర్వహించినట్లు తెలిపారు. మరోవైపు పోలీసుల చర్యపై ఆశా కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే అప్రజాస్వామికంగా అరెస్టులు చేయడం సరికాదని మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

## ప్రజావాణికి వెల్లువెత్తిన అర్జీలు

- **కలెక్టరేట్‌లో 107 ఫిర్యాదుల స్వీకరణ**

**నిజామాబాద్ జిల్లా, 23 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**



జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి కలెక్టర్ ఇలా త్రిపాఠి నేరుగా అర్జీలను స్వీకరించారు. ఉదయం 10:30 గంటలకే ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం వరకు మొత్తం 107 ఫిర్యాదులు నమోదయ్యాయి. ప్రజావాణికి వచ్చిన అర్జీలలో అధిక శాతం భూ వివాదాలకు సంబంధించినవే కావడం గమనార్హం. ధరణి సమస్యలు, సర్వే నంబర్ల సవరణలు, పట్టాదారు పాసు పుస్తకాల మంజూరు కోసం బాధితులు కలెక్టర్‌ను వేడుకున్నారు. వీటితో పాటు ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు, రేషన్ కార్డులు మరియు వివిధ వ్యక్తిగత సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అర్జీదారులకు నమ్మకం కలిగేలా సత్వరమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఫిర్యాదులను ఏమాత్రం పెండింగ్‌లో పెట్టకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించి, ఆ నివేదికను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్ మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అర్జీలను స్వీకరించిన అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించి, వినతులపై తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు.

## లైసెన్స్‌డ్ సర్వేయర్లు నిజాయతీగా పనిచేయాలి

**నిజామాబాద్ జిల్లా, 23 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**



జిల్లాలో శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లు ప్రజలకు బాధ్యతాయుతమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ ముగించుకున్న 46 మంది సర్వేయర్లకు ఆమె సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ సర్వే విషయంలో సర్వేయర్ల పాత్ర అత్యంత కీలకమని, రిపోర్టుల తయారీలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఎలాంటి అవినీతి ఆరోపణలకు తావు లేకుండా, పారదర్శకంగా సర్వే నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో వాస్తవాలను గుర్తించి నివేదికలు రూపొందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా లేదా అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సర్వే విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం 2005 రక్షణ సొసైటీ

- **ఆదిలాబాద్ జిల్లా సొసైటీ ఉపాధ్యక్షులుగా గుగ్గిల్ల.స్వామి నియామకం.**

**సిరికొండ 23 ఫిబ్రవరీ (డిడి9 వార్త న్యూస్):**



ఆదిలాబాద్ జిల్లా సమచార హక్కు చట్టం రక్షణ కమిటీ ఆదిలాబాద్ జిల్లా ఉపఅధ్యక్షులుగా గుగ్గిల్ల.స్వామిని ఎన్నుకోవడం జరిగినది.ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లోని R&B విశ్రాంతి భవనంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి కమలకార్, జిల్లా అధ్యక్షుడు వర్ని.సంతోష్ మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాసం.అనిల్ అధ్యక్షతన నూతన కమీటీని ఎన్నుకున్నారు.సమాజా నికి సేవలు అందిస్తు, అన్ని శాఖల అధికారులతో సమన్వయం పాటించే గుగ్గిల్ల.స్వామిని ఎన్ను కున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ స్వామి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు పదవి ఇచ్చినందుకు సోసైటి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సొసైటీ అభివృద్ధికి శాయశక్తుల ప్రయత్నిస్తానని, మరియు యువజన సంఘాలు,స్వచ్ఛంద సంస్థల సామాజిక కార్యకర్తగా పనిచేసిన తమను జిల్లా ఉపాధ్యక్షుడు గా నియమించినందుకు రాష్ట్ర ప్రచార కార్యదర్శి కమాలకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. సమాచార హక్కు చట్టం గురించి ప్రజల్లో అవగాహన పెంచుతూ అధికారులతో జవాబుదారీతనంతో పనిచేసేలా కృషి చేస్తాన్నాని సొసైటీ బలోపేతానికి శ్రమిస్తు ప్రజా సేవలో ఉంటానన్ని గుగ్గిల్ల.స్వామి అన్నారు.

## సమిష్టి కృషితోనే మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం

- **జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్, 23 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**



జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలో అందరి సహకారంతో మున్సిపల్ ఎన్నికలను ఎటువంటి తప్పిదాలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించగలిగామని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో ఎన్నికల విధుల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన అధికారులను ఆమె ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పని చేయడం వల్లే ఎన్నికలు సజావుగా సాగాయని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా యంత్రాంగం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. అనంతరం బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రవిబాబుతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్లు, రిటర్నింగ్ అధికారులను ఆమె సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పసిపాప మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

- **బీసీ సంక్షేమ సంఘం డిమాండ్**

**నిజామాబాద్, 23 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**
నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో రజక కుటుంబంపై అగ్రవర్ణాల వారు జరిపిన దాడిలో పసిపాప మరణించడం అత్యంత అమానుషమని నిజామాబాద్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నరాల సుధాకర్, రజక ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు గూపన్ పల్లి శంకర్ తీవ్రంగా ఖండించారు. సోమవారం నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. జాతరకు వెళ్లిన గణేష్, మౌనిక దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులపై కుల వివక్షతో దాడి చేసి, రెండు నెలల పసిగుడ్డు ప్రాణాలు తీయడం హేయమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రపంచం సాంకేతికతతో దూసుకుపోతుంటే, మరోవైపు ఇంకా కుల దురహంకారంతో దాడులు చేయడం విచారకరమని, హిందువులందరూ ఒక్కటే అని చెబుతూనే ఇలాంటి వివక్ష చూపడం సరికాదని మండిపడ్డారు. ఈ ఘటనకు కారకులైన దోషులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు దర్శనం దేవేందర్, కరిపే రవీందర్, కొయ్యడ శంకర్, సాయి బసవ, రేఖ, బాలన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.





## నిజామాబాద్ డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ బాధ్యతల స్వీకరణ

**నిజామాబాద్ జిల్లా, 23 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**
నిజామాబాద్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా ఎంఐఎం పార్టీకి చెందిన 54వ డివిజన్ కార్పొరేటర్ సల్మా తహసీన్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ ఎంఐఎం పార్టీల పొత్తులో భాగంగా డిప్యూటీ మేయర్ పీఠాన్ని దక్కించుకున్న ఆమె, కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మేయర్ కూరగాయల ఉమారాణి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటికే ఈ నెల 16న మేయర్‌గా ఉమారాణి బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు ఫయాజ్, షకీల్, పలువురు కార్పొరేటర్లు మరియు కార్పొరేషన్ సిబ్బంది పాల్గొని నూతన డిప్యూటీ మేయర్‌కు అభినందనలు తెలియజేశారు.

## 108 అంబులెన్స్‌ను తనిఖీ చేసిన జిల్లా సూపర్‌వైజర్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, 23 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**
బోధన్ మండలానికి చెందిన 108 అంబులెన్స్‌ను నిజామాబాద్ జిల్లా సూపర్‌వైజర్ స్వరాజ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనంలోని మందుల నిల్వలు, వైద్య పరికరాల పనితీరుతో పాటు సంబంధిత రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది అందిస్తున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, అత్యవసర సమయాల్లో ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వాహనంలో కాలం చెల్లిన మందులు ఉండకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు.



# మీ మాటలు.. మా పేరెంట్స్ వింటే తట్టుకోలేరు



టాలీవుడ్ నటి, బిగ్‌బాస్ ఫేమ్ హిమజ రెడ్డి అంటే తెలియని వారుండరు. ఎంతో కష్టపడి బుల్లితెర నుంచి వెండి తెర వరకు ఎదిగింది. కరోనా లాక్‌డౌన్ టైంలో యూట్యూబ్ ఛానెల్, ఇన్‌స్టాగ్రామ్ వీడియోల ద్వారా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గానూ సత్తా చాటి. ఎంతో కష్టపడి కారు, ఇల్లు కనుక్కొని తన కల నెరవేర్చుకున్నారు. కానీ హిమజ లగ్జరీ లైఫ్‌పై సోషల్ మీడియాలో రకరకాలుగా కామెంట్స్ పెడుతున్నారు కొందరు. వీటిని కొన్నాళ్లు భరించినా.. నెటిజన్లు హద్దు మీరడంతో తనదైన శైలిలో వార్నింగ్ ఇచ్చారు హిమజ. తన సంపాదన, లగ్జరీ లైఫ్ గురించి దారుణంగా కామెంట్స్ చేస్తున్న వారికి క్లాస్ పీకారు.

'నేను స్క్రీన్ మీద కనిపిస్తున్నాను అంటే సంపాదిస్తున్నానని కదా అర్థం. ఉదయం నుంచి రాత్రి వరకు సినిమాల్లో, సీరియల్స్‌లో కష్టపడుతున్నాను. బిగ్‌బాస్ నుంచి వచ్చాక 12 షాపింగ్ మాల్ ఓపెనింగ్స్ చేశాను. ఒక్కో దానికి ఎంత ఇస్తారో తెలుసా? నా కారు కొనడానికి ఆ సంపాదన చాలు. సినిమాలే కాకుండ హెర్బా లైఫ్‌కు సూపర్‌వైజర్ అని, స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేస్తా, సొంతంగా ఒక కంపెనీ కూడా స్టార్ట్ చేశాను. నేను పడుతున్న కష్టం ఎవరికీ కనిపించదు. నేను కొన్న ఇంటికి మా అమ్మానాన్నలు కూడా ఎంతో సాయం చేశారు. అది తెలియకుండా ఎవరో గిఫ్ట్ ఇచ్చారని కామెంట్స్ పెడితే వాళ్ళ గుండె పగిలిపోతుంది. నా ఈఎంఐ (EMI) పేపర్లు కూడా చూపించాలని అనుకున్నా. ఎదుటివారి సక్సెస్ చూసి ఏడవకండి' అంటూ ట్రోలర్లకు గట్టిగా బుద్ధి చెప్పారు. ఒక తెలుగమ్మాయి సక్సెస్ అయితే అభినందించడం మానేసి, ఇలా క్యారెక్టర్ మీద పడి ఏడవడం సంస్కారం కాదని హిమజ హితవు పలికారు. హద్దు మీరితే మాత్రం ఊరుకునేది లేదని మాస్ వార్నింగ్ ఇచ్చారు.

# అదృష్టం అంటే ఈమెదే..



సినిమా రిజల్ట్‌తో సంబంధం లేకుండా కొందరు నటీనటులకు అదృష్టం అలా కలిసి వస్తుంటుంది. సరిగ్గా ఇదే విషయం ఇప్పుడు హీరోయిన్ కయాదు లోహర్ విషయంలో నిజమవుతోంది. ఇటీవలే తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఫంకీ' చిత్రం ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయినప్పటికీ, ఈ భామకు మాత్రం టాలీవుడ్‌లో అవకాశాలు క్యూ కడుతున్నాయి. సాధారణంగా మొదటి సినిమా ఫ్లాప్ అయితే హీరోయిన్లకు అవకాశాలు రావడం కష్టం. కానీ కయాదు లోహర్ తన గ్లామర్ మరియు నటనతో ఇండస్ట్రీ వర్గాలను ఆకర్షించగలిగింది. అందుకే, ఆమె ఖాతాలో ఇప్పుడు వరుసగా ఆఫర్లు వచ్చి చేరుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, కయాదు ఇప్పటికే రెండు కొత్త చిత్రాలకు సంతకం చేసిందట. ఈ రెండు కథలు కూడా వైవిధ్యంగా ఉండటంతో పాటు ఆమె పాత్రలకు మంచి ప్రాధాన్యత ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సినిమాల సక్సెస్‌తో సంబంధం లేకుండా కయాదుకు ఉన్న డిమాండ్ చూసి ట్రేడ్ వర్గాలు ఆశ్చర్యపోతున్నాయి.

కొత్త సినిమాల కోసం ఆమె భారీగానే డిమాండ్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఒక్కో సినిమాకు కయాదు సుమారు కోటి రూపాయల వరకు రెమ్యునరేషన్ అడుగుతున్నట్లు సమాచారం. వరుస అవకాశాలు వస్తుండటంతో, నిర్మాతలు కూడా ఆమె అడిగిన మొత్తాన్ని ఇచ్చేందుకు వెనకాడటం లేదట. తక్కువ కాలంలోనే టాలీవుడ్‌లో కోటి రూపాయల క్లబ్‌లో చేరడం అంటే మామూలు విషయం కాదు. తన క్రేజ్‌ను పక్కాగా క్యాష్ చేసుకుంటూ కయాదు దూసుకుపోతోంది. కయాదు లోహర్ ప్రస్తుతం సంతకం చేసిన ఈ రెండు సినిమాలు గాని బాక్సాఫీస్ వద్ద హిట్ టాక్ తెచ్చుకుంటే, ఆమె రేంజ్ మరింత పెరగడం ఖాయం. ప్రస్తుతం టాలీవుడ్‌లో ఉన్న హీరోయిన్ల కొరత కూడా ఈమెకు ప్లస్ పాయింట్‌గా మారుతోంది. మరి ఈ క్రేజీ ఆఫర్లతో కయాదు తన లక్ మార్చుకుంటుందో లేదో చూడాలి!

KAYADU LOHR

# 'డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు' బోలెడన్ని ట్విస్టులతో ఉంటుంది!



రాజీవ్ కనకాల, ఉదయభాను, వసంతిక, శ్రీరామ్ వెంకట్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన వెబ్ సిరీస్ 'డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు'. 'రెక్కీ', 'విరాటపాలెం' తరువాత సౌత్ ఇండియా స్క్రీన్స్ బ్యానర్ మీద కె.వి. శ్రీరామ్ నిర్మించిన ఈ సిరీస్‌కి కృష్ణ పోలూరు దర్శకత్వం వహించారు. ఈ వెబ్ సిరీస్‌ని ఫిబ్రవరి 27 నుంచి జీ5లో స్ట్రీమింగ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఈ సిరీస్‌లోని రెండు ఎపిసోడ్స్‌ని మీడియాకి ప్రత్యేకంగా ప్రదర్శించారు.

అనంతరం నిర్వహించిన గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్‌లో రాజీవ్ కనకాల మాట్లాడుతూ "డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు' సిరీస్‌కి పని చేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు వస్తుంది. నేను ఇప్పటి వరకు ఎన్నో రకరకాల పాత్రల్ని పోషించాను. అయితే ఈ సిరీస్‌లో చేసిన కారెక్టర్ మాత్రం మైల్ స్టోన్‌లా నిలుస్తుంది. ఇందులోని నా మాడ్యులేషన్, పాత్ర తీరు, డైలాగ్స్ అన్నీ కూడా కొత్తగా ఉంటాయి. డైరెక్టర్ కృష్ణ నన్ను చాలా కొత్తగా చూపించారు. ఫిబ్రవరి 27న మా సిరీస్ స్ట్రీమింగ్ కాబోతోంది. ఏ ఒక్కరినీ నిరాశ పర్చదు.. బోలెడన్ని ట్విస్టులు కూడా ఉంటాయి. ఉదయ భాను గారితో నేను చేసిన ప్రతీ ప్రాజెక్ట్ హిట్ అయింది. ఈ సిరీస్ కూడా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందని నమ్ముతున్నాను' అని అన్నారు.

# 'బాఫ్టా' వేడుకలో సందడి చేసిన అలియా..



బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్ (బాఫ్టా) అవార్డుల వేడుకలో బాలీవుడ్ నటి అలియా సందడి చేశారు. ఫిబ్రవరి 22న జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె ప్రెజెంటర్‌గా వ్యవహరించారు. తొలిసారి ఈ అంతర్జాతీయ వేడుకకు హాజరైన ఆమె రెడ్‌కార్పెట్‌పై హొయలొలికించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన నటన, కుమార్తె రాహా గురించి పలు విషయాలను పంచుకున్నారు.

''ఇండస్ట్రీకి రావాలన్నది చిన్ననాటి కల. సినిమాల్లో నటించడం కోసమే పుట్టానేమో అనిపిస్తుంది. కెమెరా ముందు నిల్చునప్పుడు తెలియని ఉత్సాహం వస్తుంది. ఈ పరిశ్రమకు రావడం నిజంగా ఒక వరం. నటన నా బాధ్యత. దాని పట్ల నేను ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటాను. సినిమాను ఎంజాయ్ చేయడానికి భాషతో సంబంధం లేదు. ఎందుకంటే సినిమాను నడిపించేది భాష కాదు భావోద్వేగం'' అని అలియా చెప్పారు. తన కుమార్తె రాహా తనలో ఎంతో స్ఫూర్తి నింపుతోందని అన్నారు. తన పాటలకు రాహా డ్యాన్స్ చేస్తున్నప్పుడు ఎంతో ఆనందంగా ఉంటుందని చెప్పారు.

ఈ అవార్డుల వేడుకలో బెస్ట్ చిల్డ్రన్ అండ్ ఫ్యామిలీ విభాగంలో మణిపురి చిత్రం 'బూంగ్' అవార్డును సొంతం చేసుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్ర దర్శకురాలు లక్ష్మీ ప్రియదేవి 'బాఫ్టా'కు హాజరయ్యారు. తల్లిని బహుమతితో ఆశ్చర్యపరచాలని ప్రయత్నించే 'బూంగ్' అనే బాలుడి కథాంశంతో ఈ సినిమా రూపొందిన విషయం తెలిసిందే.

# రాక్షసులందరికీ ఇదే నా సమాధానం..



టాలీవుడ్ వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సినిమా ఇండస్ట్రీలో మంటలు పుట్టించారు. మార్చి 19న బాక్సాఫీస్ వద్ద తలపడనున్న రాకింగ్ స్టార్ యష్ 'టాక్సిక్' ఆదిత్య ధర్ 'ధురంధర్2' చిత్రాలను ఉద్దేశించి ఆయన చేసిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీసింది. ఈ పోరాటాన్ని 'డేవిడ్ వర్సెస్ గోలియత్' యుద్ధంతో పోల్చిన వర్మ.. భారీ బడ్జెట్, హీరో ఎలివేషన్ల కంటే కథలోని తెలివితేటలే ముఖ్యమని తనదైన శైలిలో వివరించారు. 'ధురంధర్ 2' ప్రేక్షకుల మెదడుకు పని చెబితే, 'టాక్సిక్' వంటి మాస్ సినిమాలు ప్రేక్షకులు మూర్ఖులని ఊహిస్తాయని ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి.

ముఖ్యంగా సినిమా మేకింగ్‌లో ఉండే పది క్రూరమైన సత్యాలను వర్మ ఈ సందర్భంగా ప్రస్తావించారు. 700 కోట్లు ఖర్చు చేసి ఒక హీరోను దేవుడిగా చూపించడం, ఫిజిక్స్‌కు విరుద్ధంగా గాలిలో ఎగిరే ఫైట్లు చేయడం, చెవులు చిట్లించే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌తో ప్రేక్షకులకు.. ఇక్కడ ఈలలు వేయండి అని సూచించడం వంటి అంశాలను ఆయన తప్పుబట్టారు. కేజీఎఫ్2 వంటి సినిమాలు మాస్‌లోని డంబ్‌నెస్ ను లక్ష్యంగా చేసుకున్నాయని, కానీ 130 కోట్లతో తీసిన 'ధురంధర్' కేవలం కథా బలంతో 1500 కోట్లు వసూలు చేసి ప్రేక్షకులు మేధావులని నిరూపించిందని వర్మ ఘాటుగా రాసుకొచ్చారు. వర్మ చేసిన ఈ విమర్శలు ముఖ్యంగా కన్నడ సినీ అభిమానులకు ఆగ్రహం కలిగించడంతో, సోషల్ మీడియాలో ఆయనపై విమర్శలు వెల్లువెత్తాయి. రామ్ గోపాల్ వర్మ ధురంధర్ 2కు సపోర్ట్ చేస్తూ.. టాక్సిక్‌ను తక్కువ చేశారని యష్ అభిమానులు మండిపడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా.. వర్మను ట్రోల్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, ఆర్జీవీ వెంటనే క్లారిటీ ఇస్తూ మరో పోస్ట్ పెట్టారు. రాక్షసులందరికీ నా సమాధానం ఇదే అంటూ.. తాను కేవలం రెండు రకాల సినిమా శైలుల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మాత్రమే వివరించానని, ఏ ఒక్క చిత్రాన్ని వ్యక్తిగతంగా కించపరచడం తన ఉద్దేశం కాదని క్లారిటీ ఇచ్చారు. అంతేకాకుండా మార్చి 19న థియేటర్లలో లైట్లు ఆరిపోయినప్పుడు భారతీయ సినిమా ధురంధర 2 లేక టాక్సిక్ అనేది తేలిపోతుందని ఆయన సవాల్ విసిరారు. దీంతో వివాదానికి చెక్ పడినట్లు అయింది.



# 'ఉస్తాద్ భగత్ సింగ్'.. ఎట్టకేలకు క్లారిటీ ఇచ్చిన హరీశ్ శంకర్

'ఉస్తాద్ భగత్‌సింగ్'లో ఎలాంటి రాజకీయ అంశాలు ఉండవని, పవన్‌కల్యాణ్‌ను ఎంటర్‌టైన్‌మెంట్ మోడ్‌లో చూస్తారని దర్శకుడు హరీశ్ శంకర్ స్పష్టత ఇచ్చారు. తాజాగా ఈ మూవీ నుంచి 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటను విడుదల చేశారు. దీంతో ప్రస్తుత రాజకీయాలపై సెటైర్లు, విమర్శలు ఉంటాయని పలువురు భావిస్తుండటంతో దీనిపై హరీశ్ శంకర్ స్పష్టతనిచ్చారు.

''ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటకు మంచి స్పందన వస్తోంది. అభిమానులు వాళ్ల ఎడిట్స్ పంపిస్తుంటే ఆనందంగా ఉంది. దీనికి 'ట్రాన్స్‌బస్టర్' అని పేరు పెట్టాలని నా స్నేహితుడు సలహా ఇచ్చాడు. చాలా బాగుంది. ఇది పవన్‌కల్యాణ్ వ్యక్తిత్వానికి, పర్సనల్ యాటిట్యూడ్‌కు దగ్గరగా ఉండటంతో కొంతమంది కొన్ని ఆసక్తికర అంశాలను లేవనెత్తారు. ప్రస్తుత రాజకీయాలపై ఇందులో సెటైర్లు ఉంటాయా? అని అడుగుతున్నారు. ఒకళ్లిద్దరు అడిగి ఉంటే నేను పెద్దగా స్పందించి ఉండేవాడిని కాదు. ఈ సినిమా మొదలు పెట్టిన దగ్గరి సినిమా, రాజకీయాలు వేర్వేరని పవన్‌కల్యాణ్‌గారు మాతో చెబుతూనే వచ్చారు. ఆయనా అదే పాటించారు. సైద్ధాంతిక విభేదాలు ఉన్నా పక్కనపెట్టి ప్రకాశ్‌రాజ్‌తో పవన్‌కల్యాణ్ నటించారు. వ్యక్తిగతంగా ఆయన ఎవరినీ టార్గెట్ చేయరు''

''సినిమాలో డైలాగ్స్, సన్నివేశాలు, రిఫరెన్స్‌లు చూసి ఏ ఒక్కరూ చిన్న బుచ్చుకునేలా చేయొద్దు. సినిమా అంతిమ లక్ష్యం వినోదం పంచడం. అది దెబ్బతింటుంది' అన్నారు. 'గాజు పగిలితే..' అనే డైలాగ్ హీరో క్యారెక్టర్‌ను ఎలివేట్ చేసేలా రాశామంతే. ఇంకొకరిని తక్కువ చేసేలా చేయలేదు. ఆయనకు అన్ని పార్టీల్లో ఫ్యాన్స్ ఉన్నారు. ఓట్లు ఎవరికి వేసినా సినిమా అంటే ఈయన దగ్గరికే వస్తారు. ఇంకా గొప్ప విషయం ఏంటంటే, 'అన్నా మనకు రాజకీయాలు వద్దు. ఎంటర్‌టైన్‌మెంట్ కావాలి' అని ఫ్యాన్సే కోరారు. నిజంగా మీకు హ్యాట్సాఫ్. కల్యాణ్‌గారిని ఫాలో అవడమంటే, స్టైల్, స్వాగ్‌ను మాత్రమే కాదు, ఆయన సిద్ధాంతాన్ని ఫాలో అవుతున్నారు. ఏ పార్టీని కానీ, ఏ వర్గాన్ని కానీ కించపరిచేలా ఈ సినిమాలో డైలాగ్స్ ఉండవు అని అన్నారు'' అని హరీశ్ శంకర్ స్పష్టత ఇచ్చారు.

మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రంలో శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది.